క్లుప్తంగా

రేపు అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

పీలేరురూరల్ : పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం పీలేరు నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం బి.నిర్మల తెలిపారు. భక్తుల సౌకర్యార్థం రద్దీని బట్టి 5 నుంచి 10 బస్సులు నడుపుతామని తెలిపారు. ఆసక్తిగల భక్తులు ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చునని చెప్పారు. వివరాలకు 9441774743 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన మహాభారతయజ్ఞం



యుద్ధం చేస్తున్న దుర్యోధన, భీముని వేషదారులు

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో 18 రోజులుగా నిర్వహించిన మహాభారత యజ్ఞం ఆదివారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టంతో ముగిసింది. మహాభారత యజ్ఞం వద్ద మట్టితో దుర్యోధన ప్రతిమ ఏర్పాటు చేశారు. అక్కడ దుర్యోధన, భీముని వేషదారులు చేసిన యుద్ధ ఘట్టం రక్తి కట్టించింది. దుర్యోధుని వధ అనంతరం ప్రతిమ మట్టి కోసం భక్తులు ఎగబడ్డారు. దుర్యోధన వధ అనంతరం ధర్మరాజు పట్టాభిషేకం, అనంతరం రాత్రి ద్రౌపది మాత అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. రాత్రి సాసవుల చిన్నమ్మ కథ నాటకం ప్రదర్శించారు. దీంతో మహాభారత యజ్ఞం దిగ్విజయంగా ముగిసింది.

ఆదేశాలు ఉల్లంఘిస్తే కేసులు

బి.కొత్తకోట: మండలంలోని గట్టు గ్రామంలో కోర్టు వివాదంలోని ప్రభుత్వ భూమిలో ఎవరైనా ప్రవేశిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ అజారుద్దీన్ హెచ్చరించారు. ఆదివారం వివాదాస్పద భూమిలో స్టే కలిగిన వ్యక్తి పోలంలో దున్నుతున్నట్టు వీడియో, ఫొటోలు వైరల్ అయ్యాయి. దీనిపై స్పందించిన తహసీల్దార్ చర్యల కోసం ఆర్ఐ వీరాంజనేయులను పంపగా ఆయన పరిశీలించి అక్కడనున్న వారిని పొలం నుంచి పంపేశారు. వివాదాలు సృష్టించడం, ఉత్తర్వులను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



విత్తనాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

బి.కొత్తకోట: రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించి, వాటి ఫలితాలకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపడితే మేలైన దిగుబడులు పొందవచ్చని కలికిరి ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.స్వరాజ్యలక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని కోటావూరులో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు అవగాహన కల్పించారు. తగిన మోతాదులోనే ఎరువులు వినియోగించాలని కోరారు. ట్రైకోడ్మా విరిడి మొగు జీవ శిలీంధ్రనాశిని వాడటం వలన నేల ద్వారా పంటలకు సంక్రమించే తెగుళ్లను అరికట్టవచ్చని సూచించారు. విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ కే.మాధురి మాట్లాడుతూ కేవీకే లక్ష్యాలను వివరించారు. వరి, వేరుశనగ, కంది పంటల్లో నూతన వంగడాలను రైతులకు తెలిపారు. కేవీకే విస్తరణ సేవలను సద్వినియోగం చేసుకుని పంటల సాగులో మార్పులు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీకే ఫామ్ మేనేజర్ ఆశోక్‌కుమార్, ఏఓ చంద్రశేఖర్, వీఏఓ షంషీర్, రైతులు పాల్గొన్నారు.

నివాళి

మదనపల్లె రూరల్ : పట్టణంలోని శేఖర్ స్వీట్స్ వ్యవస్థాపకులు పి.ముత్తుస్వామి మృతదేహానికి ఆదివారం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 37 ఏళ్లుగా ప్రజలందరి ఆదరాభిమానాలతో శేఖర్ స్వీట్స్ షాపును నడుతూ అందరికీ సుపరిచితులైన ముత్తుస్వామి మరణం బాధాకరమన్నారు. స్థానికులు ఎంతో మందికి ఆయన ఉపాధి కల్పించడమే కాకుండా, సమాజసేవలోనూ తనవంతు బాధ్యత నిర్వర్తించారని కొనియాడారు. భగవంతుడు ఆయన ఆత్మకు శాంతిని ప్రసాదించాలని కోరుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సదాశివనాయుడు, మల్లికార్జునరెడ్డి, చరణ్, శ్రీకాంత్, ఖిజర్‌ఖాన్, యూనస్, రాజేష్, గోవిందు, నమీసాబ్, గ్రానైట్ మహేష్ పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం



పూజ కార్యక్రమంలో దుగసాని కుటుంబసభ్యులు

తంబళ్లపల్లె: నియోజకవర్గ కేంద్రం తంబళ్లపల్లెలో గ్రామీణ ప్రజలకు నూతన ఆధునాత సౌకర్యాలతో కె.మేకలవారిపల్లె దుగసాని ఫ్యామిలీ కల్యాణ మండపం నిర్మించి గ్రామీణ ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఆదివారం దుగసాని యశోధమ్మ, ఆనందరెడ్డి, కవిత, రమణారెడ్డి దంపతులు హోమాలు నిర్వహించి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర (ఎస్ఎల్‌వీ) కల్యాణ మండపాన్ని ప్రారంభించారు.

ఇంటర్, పీజీ కోర్సులు ప్రారంభమయ్యేనా..!



బీటీ ప్రభుత్వ కాలేజీ



బీటీ కాలేజీలో మూతపడిన పీజీ కోర్సుల విభాగం భవనం

- అందని ద్రాక్షలా ఉన్నత విద్య
- విద్యార్థులకు తప్పని తిప్పలు

మదనపల్లె సిటీ: ఎంతో ఘన చరిత్ర కలిగిన ప్రభుత్వ బీటీ కాలేజీలో ఎంతో మంది చదువుకుని ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. సుమారు 110 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. రాయలసీమలోనే మొట్టమొదటి కాలేజీ బీటీ కాలేజీ. అంత ఘనత కలిగిన ఈ కళాశాలలో ఇంటర్మీడియట్, పీజీ కోర్సులు లేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం డిగ్రీ కోర్సులకే పరిమితమవడంతో కొందరు ఉన్నత చదువులకు నోచుకోని పరిస్థితి ఉంది.

ఇంటర్ కో ఎడ్యుకేషన్ లేక..

డివిజన్ కేంద్రమైన మదనపల్లెలో ఇంటర్మీడియట్‌లో కో ఎడ్యుకేషన్ ఇంటర్ కళాశాల లేదు. గతంలో బీటీ కాలేజీలో ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు ఉండేవి. 1972 నుంచి ఇంటర్మీడియట్ కోర్సులు నడుస్తున్నాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగం ఉండేది. క్రమేణా విద్యార్థులు చేరకపోవడంతో 2020లో ఇంటర్మీడియట్ కళాశాల మూతపడింది. దీంతో విద్యార్థులు ప్రైవేటు కాలేజీలో చేరాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ విషయంపై విద్యార్థి సంఘాలు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

పీజీ కోర్సులు బంద్

ఉన్నత చదువులు చదవాలనుకున్న విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. కాలేజీలో పీజీ విభాగంలో 1983 నుంచి ఎం.ఎ (ఎకనామిక్స్) ఎంకాం కోర్సులు ప్రారంభించారు. తరువాత 1998 నుంచి ఎంఎస్‌సి (కంప్యూటర్ సైన్సు), ఎంఎస్సీ (మ్యాథ్స్, కెమిస్ట్రి, ఫిజిక్స్)ఎంఎ ఇంగ్లీషు, తెలుగు పొలిటికల్ సైన్సు కోర్సులు ప్రారంభించారు. గత మూడు సంవత్సరాల నుంచి విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరలేదనే కారణంతో పీజీ కోర్సులను మూసివేశారు.

ఇంటర్, పీజీ కోర్సులు ప్రారంభానికి చర్యలు



బీటీ కాలేజీలో ఇంటర్మీడియట్, పీజీ కోర్సులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం. దీనిపై ఎమ్మెల్యేలకు తెలియజేస్తాం. కోర్సులు ప్రారంభించడానికి యూనివర్శిటీ అధికారులకు కూడా సంప్రదిస్తాం.

-వై.ఎస్.మునిరత్నం, కరస్పాండెంట్, బీటీ కాలేజీ, మదనపల్లె

ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ‘కూటమి’



కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. వాల్మీకిపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయనను నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారినుద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై జూన్ నాలుగో తేదికి ఏడాది కావస్తోందని, ఇప్పటివరకూ సూపర్ సిక్స్ హామీలేవీ నెరవేర్చలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై విస్తృతంగా ప్రచారం చేపట్టాలని పిలుపునిచ్చారు. కూటమి పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు రేషన్ బియ్యాన్ని ఇంటింటికి సరఫరా చేస్తున్న ఎండీయూ వాహనాలను రద్దు చేసిన ప్రభుత్వం వేలాది కుటుంబాల స్వయం ఉపాధిపై దెబ్బకొట్టి వారికి రోడ్డున పడేసిందన్నారు. ప్రభుత్వం అనాలోచితంగా అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో ప్రజల దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలోని ఓబులంవారిపల్లి గ్రామానికి చెందిన కె.పెద్దరెడ్డెప్ప రెడ్డి కుమార్తె అచిత నిశ్చితార్థ కార్యక్రమానికి ఆదివారం చింతల రామచంద్రారెడ్డి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల ఆనందరెడ్డి, వాల్మీకిపురం ఉప సర్పంచ్ కేశవరెడ్డి, చిన్నరెడ్డెప్పరెడ్డి, రాజన్న, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ రెడ్డి కుమార్, మురళి, చిన్న ఓబుల్‌రెడ్డి, నాగేశ్వరనాయుడు, మురళీమోహన్‌నాయుడు, మదన్‌మోహన్‌నాయుడు, రామాంజులు, వెంకటస్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు

పీలేరు : సదుం మండలం సల్లావారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి కుమారుడు దుర్గార్జునరెడ్డికి రేవతితో వారం రోజుల క్రితం వివాహం జరిగింది, ఆదివారం స్థానిక ఎస్ కన్వెన్షన్ హాల్ నందు వారి రిసెప్షన్ జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహితాఆనంద్, అమరనాథరెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, ఉదయ్‌కుమార్, చక్రధర్, కాలనీ చిన్న, లోకనాథరెడ్డి, భువన, షాకీర్, మునీర్, గోవర్ధన్‌రెడ్డి, ఉబేదుల్లా, అబీద్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కలకడ : మండలంలోని రైతులు రాయితీ వేరుశనగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య కోరారు. కలకడ మండలానికి టీసీజీఎస్ రకం 99.9 క్వింటాళ్లు , నారాయణి రకం 620 క్వింటాళ్ల రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీలో పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

రక్తదానం చేయడంలో యువత ముందుండాలి

పెద్దమండ్యం: రక్తదానం చేయడంలో యువత ముందుండాలని హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు ఆబూబకర్‌సిద్దిక్ అన్నారు. పెద్దమండ్యంలో ఆదివారం హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో ఉచిత రక్త వర్గీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బ్లడ్ గ్రూప్స్‌ను తెలుసుకోవాలనే ఉచిత రక్త వర్గీకరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మదనపల్లె ముఖ్య కేంద్రంగా 12 సంవత్సరాలుగా ఎన్నో అవగాహన కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయాలన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమనమని, యువకులు రక్తం దానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు. మదనపల్లె వాలంటరీ బ్లడ్ బ్యాంక్ అధికారి బాలచంద్రనాయుడు, సంస్థ సభ్యులు కిరణ్, చైతు, చరణ్, నగేష్, మహబూబ్‌సున్నీ లు పాల్గొన్నారు.

దర్జాగా బందెలదొడ్డి కబ్జా?

ప్రహరీ నిర్మాణం



పహరీ నిర్మించిన దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: మదనపల్లె మున్సిపాలిటీ స్థలాలు ఒక్కొక్కటిగా దర్జాగా కబ్జాలకు గురి అవుతున్నా మున్సిపల్ అధికారులు రక్షణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలను వెల్లువెత్తున్నాయి. స్థానిక సబ్‌కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో మిషన్ కాంపౌండ్ ముఖద్వారం ఎదురుగా మున్సిపాలిటీకి రూ.కోట్ల విలువైన బందెలదొడ్డి భూమి ఉంది. ఇది రోడ్డుపైనే ఉండటంతో విలువ కట్టలేరు. ఈ భూమి మున్సిపాలిటీకి చెందినది అయినప్పటికి ప్రైవేటు వ్యక్తులతో వివాదం వల్ల న్యాయస్థానంలో కేసు నడుస్తోందని తెలిసింది. వివాదం అయితే భూమి యథాస్థానంలో ఉండాలి. లేదంటే మున్సిపాలిటి సంరక్షణలోనైనా ఉండాలి. ఈ రెండు లేక ఇప్పుడు కోట్ల విలువైన భూమి పరాధీనం అవుతోంది. ఆదివారం రోజు కావడంతో అధికారులు పట్టించుకోరన్న ధీమాతో కబ్జా సాగిస్తున్నారు. బహిరంగంగా రహదారిపై ప్రహరీ నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేశారు. భూమి చుట్టూ ఇలాంటి నిర్మాణం చేశారు. భూమి ఎత్తు పెంచేందుకు టిప్పర్లతో మట్టిని తరలించి నింపేస్తున్నారు. పట్టణ నడిబొడ్డున ఈ కబ్జా సాగుతుంటే ఒక్క అధికారుల దృష్టికి రాకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రధానంగా పుంగనూరు రహదారిపై ఇంతటి విలువైన భూమి ఎంత ధర పెట్టినా దొరికే అవకాశమే లేదు. దీనితో పక్కా ప్రణాళికతో భూమికి కబ్జా చేస్తున్నట్టు కనిపిస్తోంది. దీనిపై విచారణ జరపాల్సిందిగా కమిషనర్ ప్రమీల, టీపీఓ రెడ్డెమ్మను పంపగా ఆమె విచారించారు.

బందెలదొడ్డి స్థలంలో నిర్మాణాలు ఎలా చేపడుతారని పనులు నిలిపివేయించారు. సర్వే నిర్వహించి చర్యలు తీసుకుంటామని అక్కడి పనివాళ్లకు చెప్పి టిప్పర్లను వెనక్కి పంపారు. కాగా ఈ భూమికి సంబంధించి మున్సిపల్ రికార్డులు ఉన్నాయా లేవా అన్నదానిపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లా లేదా రాష్ట్రస్థాయి మున్సిపల్ స్థలాల రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటే కోట్ల విలువైన మున్సిపల్ భూమిని కాపాడినట్టు లేదంటే ఏం జరుగుతుందో చూడాలి. అయితే ఈ భూమి తమదేనని, దీనికి రికార్డులు ఉన్నట్టు చెబుతున్నారని కమిషనర్ చెప్పారు.

క్రీస్తు బోధనల ఆచరణతో విశ్వశాంతి



చర్చిలో ప్రార్థన చేస్తున్న నిసార్‌అహ్మద్ తదితరులు

మదనపల్లె రూరల్ : ఏసుక్రీస్తు బోధనలు ఆచరించటం ద్వారా విశ్వశాంతి లభిస్తుందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. పట్టణంలోని పెంతెకోస్తు మిషన్ చర్చిలో, స్థానిక క్రైస్తవ సోదరుల ఆహ్వానం మేరకు..మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతితో కలిసి ఆదివారం ప్రార్థనల్లో నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలు ఇప్పటికీ, ఎప్పటికీ ప్రపంచంలోని మానవాళికి మార్గదర్శకమన్నారు. కుల, మత, వర్ణ విభేదం లేకుండా సేవాభావంతో మెలగడమే క్రైస్తవమన్నారు. అన్ని మతాల సారాంశం మానవత్వమేనని ఆయన ఎంచుకున్న మార్గం అందరికీ దిక్సూచిగా నిలుస్తోందన్నారు. ఇతరులపై ప్రేమ, సహనం, శాంతి, సేవాభావం వంటి గొప్ప గుణాలను ఆచరించాలని శాంతిదూత ఇచ్చిన సందేశం మనందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. క్రిస్టియన్‌ల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, కో ఆప్షన్ శారదారెడ్డి, నాయకులు మునిశేఖర్, రాజేష్, రిచీ, మయూర్, ప్రభాకర్, శ్రీనివాసులు, శ్యామ్, శంకర్‌నాయక్, శ్రీకాంత్‌నాయక్, వి.యాదవ్, చరణ్, చిన్న, భానుప్రకాష్, జహీర్, నాగమణి పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదంతో నియామకం

మదనపల్లె: ప్రభుత్వ ఆదేశాలు, కౌన్సిల్ తీర్మానం మేరకే 80 మంది పారిశుద్ధ్య దినసరి కార్మికులను విధుల్లోకి తీసుకున్నామని కమిషనర్ ప్రమీల ఒక ప్రకటనలో తెలిపారు. సాక్షిలో ప్రచురితమైన ‘ఆ మున్సిపాలిటీ రూటే సపరేటు’ కథనంపై స్పందించిన కమిషనర్ నిబంధనల మేరకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. దీనికి 2024లో ప్రభుత్వం జారీచేసిన మెమో మేరకే చర్యలు తీసుకున్నామని తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయండి

రాయచోటి టౌన్ : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం ఎన్నో ఏళ్లుగా కార్మిక వర్గం సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ 9వ తేదీ (నేడు) సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజనేయులు అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహించి ఆయుధాలు అమ్ముతూ అమెరికా తన సామ్రాజ్యాన్ని విస్తరించడానికి దేశాల మీద విచ్చలవిడిగా సుంకాలు విధిస్తున్నారు.

యోగాతో ఆనంద జీవితం



యోగా చేస్తున్న వృద్ధులు

మదనపల్లె సిటీ: యోగాతో ఆనంద జీవితం గడపవచ్చునని యోగా మాస్టర్ డాక్టర్ అనితలక్ష్మి అన్నారు. ఆదివారం స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాల, వృద్ధాశ్రమంలో యోగా మాసోత్సవాలను పురస్కరించుకుని యోగా సమావేశం నిర్వహించారు. యోగతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా పిల్లల నుంచి పెద్దల వరకు యోగాను ఆచరించవచ్చునన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, బొమ్మచెరువు మెడికల్ ఆఫీసర్ జె.దివ్య, వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రలో పాల్గొనండి

కలకడ : మండల స్థాయిలో చేపట్టే యోగాంధ్ర కార్యక్రమంలో మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీఓ అబ్దుల్‌రహీం కోరారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు కె.బాటవారిపల్లె ప్రభుత్వ పాఠశాల నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించి కలకడ మూడురోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



లక్ష్మీనరసింహుడికి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహాస్వామి కల్యాణోత్సవం రంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆదివారం స్వాతి నక్షత్రంతో పాటు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. పంచామృతాలకు ప్రత్యేకంగా మూలవర్లకు అభిషేకాలు కావించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్ని అకట్టుకొంది. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లి వేడుక నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయఅర్చకులు కృష్ణరాజ బట్టార్, రాజుస్వామి, గోకుల్‌స్వాములు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం చేస్తున్న వేద పండితులు

కలికిరి: పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు ఆదివారం రాత్రి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం నరసింహస్వామి సతీసమేతంగా గరుడ వాహనంపై పుర వీధుల్లో విహరించారు. ఉదయం తిరుమంజనం కార్యక్రమంలో భాగంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవం నిర్వహించనున్నారు.

చల్లంగా చూడమ్మా.. రెడ్డెమ్మ తల్లి



అమ్మవారి దర్శనం కోసం వేచివున్న భక్తులు

గుర్రంకొండ: ‘చల్లంగా చూడమ్మా.. రెడ్డెమ్మ తల్లి’ అంటూ భక్తులు వేడుకున్నారు. మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది. ఆలయంలో అమ్మవారికి వేకువజామునే నైవేద్యాలు సమర్పించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి.. అమ్మవారి ఎదుట సంతానం కోసం వరపడ్డారు.

దోస్త్ మేరా దోస్త్

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె ఉన్నతపాఠశాలలో 2008–09 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 16 ఏళ్ల అనంతరం తమ స్నేహితులను కలుసుకొని ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. తాము చదివిన తరగతి గదిలోకి వెళ్లి తమ తోటి స్నేహితులతో నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు రెడ్డెప్పరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యాయులు సుజాత, రెడ్డిశేఖర్, క్రిష్ణప్ప, తదితరులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు రసూల్, విజయలక్ష్మి, ప్రసన్న, ఆంజి, మల్లికార్జున, సాయి, జావిద్, మస్తాన్ పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



చిన్నారుల సంప్రదాయ నృత్యప్రదర్శన

కలికిరి: పట్టణంలోని వారాహి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో ఆదివారం ప్రదర్శించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథుగా హాజరైన అంబాఆయుర్వేద వైద్యశాల డాక్టర్ మహేంద్ర, ఎస్వీయూ మాజీ పాలక మండలి సభ్యులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలు అంతరించిపోతున్న తరుణంలో వారాహి సంస్థ ఆధ్వర్యంలో బాలికలకు భరతనాట్యం, జానపద నృత్యం, కోలాటాలు వంటి సంప్రదాయ నృత్యం చేర్పించడం అభినందనీయమని సంస్థ నాగలక్ష్మిని వక్తలు అభినందించారు. అనంతరం బాలికలకు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్, విశ్రాంత ఎంఈఓ ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.